బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ సోమవారం 21 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 3

## త్వరలో హైదరాబాద్-యాదాద్రి ఎంఎంటీఎస్ పనులు



- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వివరాలు 2వ పేజీలో

# గొప్ప పనులు చేయాలంటే రిస్క్ తీసుకోవాలి

- మంచి నాయకుడిగా ఎదగాలంటే ధైర్యం, త్యాగం కీలకం
- హైదరాబాద్ నగరాన్ని దేశానికి ఒక రోల్ మాడల్ గా, గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం
- సీఎం రేవంత్‌రెడ్డి
- ఐఎస్‌బీ ఆధ్వర్యంలో నాయకత్వ సదస్సు

**బలగం టీవి, హైదరాబాద్**

జీవితంలో గొప్ప పనులు చేయాలంటే కొంత రిస్క్ తీసుకోవాలని, రిస్క్ తీసుకోకుండా లక్ష్యాలను సాధించలేమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. మంచి నాయకుడిగా ఎదగాలంటే ధైర్యం, త్యాగం కీలకమైన అంశాలన్నారు. ఐఎస్‌బీ నిర్వహించిన నాయకత్వ సదస్సు-2024 లో పాల్గొన్న ముఖ్యమంత్రి లీడర్ షిప్ ఇన్ న్యూ ఇండియా అంశంపై ప్రసంగించారు.

హైదరబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా నిలబెట్టడంలో అందరి సహకారం కావాలని సదస్సులో కోరారు. దేశంలోని నగరాలతో కాకుండా, న్యూయార్క్, ప్యారిస్, టోక్యో , సియోల్ వంటి నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలని కోరుకుంటున్నట్టు ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఐఎస్బీ విద్యార్థులు హైదరాబాద్, తెలంగాణతో పాటు న్యూ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్లు అని, తెలంగాణను ట్రిలియన్ ఎకానమీ ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యసాధనలో సహకరించాలని, వెళ్లే ప్రతి చోట తెలంగాణ, హైదరాబాద్ గురించి మాట్లాడాలని సూచించారు.

రాష్ట్రంలో స్కిల్స్ యూనివర్సిటీ, గచ్చిబౌలిలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, హైదరాబాద్ నగరాన్ని దేశానికి ఒక రోల్ మాడల్ గా, గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దాలన్నదే తమ ఆలోచన అని ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఇతర రాష్ట్రాలు పట్టణాలతో తాను హైదరాబాద్‌ను పోల్చబోననీ, తన పోటీ న్యూయార్క్, లండన్, పారిస్, టోక్యో, సియోల్‌తోనే అని చెప్పారు.



తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ చేయాలనేదే లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇది సాధ్యం కావాలంటే 600 బిలియన్ డాలర్ సిటీగా హైదరాబాద్ అభివృద్ధి కావాలన్నారు. కష్టమే అయినా.. అసాధ్యం మాత్రం కాదంటూ పేర్కొన్నారు. దేశంలోని నగరాలతో కాదు న్యూయార్క్, ప్యారిస్ లాంటి నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలంటూ రేవంత్ రెడ్డి సూచించారు.

గాంధీ, నెహ్రూ, ఇందిరాగాంధీ, మన్మోహన్ సింగ్, పీవీ నరసింహారావు సహా ఎంతో మంది నాయకులు మనందరికీ ఆదర్శమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఐఎస్‌బీలో ఉన్నవారంతా తెలంగాణ, దేశానికి అంబాసిడర్లు అని చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని 600 మిలియన్ సిటీగా మార్చేందుకు అంతా సహకారం అందించాలని కోరారు. ప్రజలతో మమేకమైతే ఏదైనా సాధించవచ్చని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.తమ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల తరహాలో మంచి జీతాలు ఇవ్వలేకపోవచ్చు కానీ, మంచి సవాళ్లు, జీవితానికి సరిపడా నాలెడ్జ్‌ను మాత్రం అందిస్తుందని చెప్పారు. ఒలింపిక్స్?లో అత్యధిక పతకాలు గెలవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని స్పష్టం చేశారు. వ్యాపారాల్లో రాణిస్తున్న వారు ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.



## నేటి నుంచే గ్రూప్-1 మెయిన్స్

- పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల పటిష్ట బందోబస్తు
- హాజరుకానున్న 31,383 మంది అభ్యర్థులు

**బలగం టీవి, హైదరాబాద్**

గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు నేటి నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందుకోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.ఈనెల 21 వ తేదీ నుంచి 27 వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. ఈ పరీక్షలను గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన 31,383 మంది అభ్యర్థులు రాయనున్నారు. ఇప్పటికే 90శాతం మంది అభ్యర్థులు తుది పరీక్షల కోసం హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకున్నారు.

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 46 పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేశారు. హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డి జిల్లాలో 11, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలను కేటాయించారు. అన్ని కేంద్రాల వద్ద ఎలాంటి అవకతవకలు, అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించనున్నారు. పోలీస్ కమిషనర్లతో ప్రభుత్వం తగిన బందోబస్తు ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాల వద్ద స్వల్ప సంఘటనలు జరుగకుండా అత్యంత అప్రమత్తంగా పరీక్షల నిర్వహణ నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. 2011 సంవత్సరం తర్వాత గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు సోమవారం నుంచి జరగను న్నాయి. ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నింటిలోనూ సీసీ టీవీలను ఏర్పాటు చేశారు. టీజీపీఎస్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా సీసీలను పోలీసులు పర్యవేక్షిస్తారు

పరీక్షల నిర్వహణలో కచ్చితమైన నియమ నిబంధనలు పాటించేలా స్పష్టమైన మార్గదర్శకాలు పాటించేలా చర్యలు తీసుకున్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకోవడానికి ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా ఒక గంట సమయాన్ని అదనంగా కేటాయించారు. స్క్రైబ్‌ల సహాయంతో పరీక్షలు రాసే వారికి ప్రత్యేకంగా 4 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్నిపరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద నిరంతరం విద్యుత్ సరఫరా అందించేవిధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.

## మహిళల టీ20 ప్రపంచకప్ విజేత కివీస్




- ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై ఘన విజయం

**బలగం టీవి, హైదరాబాద్**

ఐసిసి మహిళల టీ20 ప్రపంచకప్ విజేతగా న్యూజిలాండ్ మహిళల జట్టు నిలిచింది. దక్షిణాఫ్రికా -న్యూజిలాండ్ జట్లు ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో తలపడ్డాయి. ఈ సమవుజ్జీల పోరులో కివీస్ విజేతగా నిలిచి పొట్టి కప్ చేజిక్కించుకుంది. టైటిల్ కోసం హెూరాహెూరీగా సాగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు 32 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది మహిళల టీ20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది.కాగా, ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 158/5 పరుగులు చేసింది. ఓపెనర్ సుజీ బేట్స్(32), ఆల్‌రౌండర్ అమేలియా కేర్ (43), బ్రూకే హల్లిడే(38)లు దంచి కొట్టారు. సఫారీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ చకచకా డబుల్స్, బౌండరీలు సాధించింది.

159 పరుగుల భారీ చేధనలో అమేలియా కేర్(24/3) విజృంభణతో సఫారీ జట్టు ఒత్తిడిలో పడిపోయింది. కెప్టెన్ లారా వొల్వార్ట్ (33) మినహా ఏ ఒక్కరూ స్థాయికి తగ్గట్టు ఆడలేదు. కెప్టెన్ లారా వొల్వార్ట్(33), తంజిమ్ బ్రిట్స్(17)లు ధాటిగా ఆడారు. రన్‌రేటు 7కు తగ్గకుండా ధనాధన్ ఆడారు. దాంతో, సఫారీ జట్టు 6 ఓవర్లకు వికెట్ కోల్పోకుండా 47 పరుగులు పిండుకుంది. పవర్ ప్లే తర్వాతి ఓవర్లో తంజిమ్ భారీ షాట్‌కు ప్రయత్నించి బౌండరీ వద్ద గ్రీన్‌కు చిక్కింది. అలా 51 వద్ద సఫారీల తొలి వికెట్ పడింది. అమేలియా కేర్ 10వ ఓవర్లో మొదట లారాను .. ఆఖరి బంతికి డేంజరస్ అనెకె బొష్(9)ను పెవిలియన్ పంపి సఫారీలను ఒత్తిడిలో పడేసింది. ఆ సమయంలో బాధ్యతగా ఆడాల్సిన మరినే కాప్(8), నడినె డిక్లెర్క్(6)లు దంచబోయి వికెట్ పారేసుకున్నారు. అంతే.. 77 పరుగులకే సగం మంది డగౌట్ చేరారు. ఇక.. జట్టును గెలిపించాల్సిన బరువు టెయిలెండ్ల మీద పడింది. కానీ, వరుసగా వికెట్లు తీసిన కివీస్ బౌలర్లు దక్షిణాఫ్రికాను ఓటమి అంచుల్లోకి నెట్టారు. కివీస్ బౌలర్లు ధాటికి సఫారీల జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 126 పరుగులకే పరిమితమైందది. దాంతో తొలి సీజన్ నుంచి ఊరిస్తున్న మహిళల టీ20 వరల్డ్ కప్‌ను న్యూజిలాండ్ కొల్లగొట్టింది.



## తెలంగాణలో మోస్తరు వర్షాలు

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉత్తర అండమాన్ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని.. దాని ప్రభావంతో రాగల 24గంటల్లో తూర్పు మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర అండమాన్ ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ నెల 22 నాటికి పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ బలపడి వాయుగుండంగా మారుతుందని పేర్కొంది. 23వ తేదీ నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై తుఫానుగా మారుతుందని పేర్కొంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది.

పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఉత్తర తమిళనాడు తీరప్రాంతంలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని.. ఎత్తుకు వెళ్లే కొలది నైరుతి దిశగా వంగి ఉందని వివరించింది. ఈ క్రమంలో రాష్ట్రంలో ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబా బాద్, వరంగల్, హన్మకొండ, వనపర్తి, నారాయణపేట, జోగులాం బ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షాలుపడేందుకు అవకాశం ఉందని వివరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. అలాగే, ఈ నెల 25 వరకు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం చెప్పింది.



## తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేశారు. ఎందుకంటే సియోల్‌లో రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌ను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున నిపుణులు, పర్యావరణవేత్తలు, హైడ్రాల జిస్టులు, ఇంజినీర్లు, బ్యూరోక్రాట్లను పంపుతున్నందుకు అభినందనలు తెలుపుతున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ఈ బృందం మొత్తం అద్భుతమైన ఫలితాలతో తిరిగి వస్తుంది. ఇక ప్రజాధనం రూ. 1.5 లక్షల కోట్లను ఖర్చు చేయొచ్చని కచ్చితంగా సమర్థిస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. ఇక సౌత్ కొరియాలోని సియోల్ నగరంలో రాష్ట్ర ప్రభుత్వం బృందం ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు పర్యటించనుంది. భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య, అధికారులతో పాటు ఆయా మీడియా సంస్థల ప్రతినిధులు సియోల్ టూర్‌కు వెళ్లే వారిలో ఉన్నారు.

## 'కాంగ్రెస్ నాయకులది కపట ప్రేమ'



**బలగం టీవి, హైదరాబాద్**

" ఈ మధ్యకాలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ బాధితులపై కపట ప్రేమ చూపిస్తున్నారు. పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇస్తామని గొప్పగా చెప్తుండు. దమ్ముంటే బీఆర్ఎస్ హయాంలో చేసినట్లు మూసీ బాధితులకు న్యాయం చేయాలి" అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హరీశ్ రావు మీడియా సమావేశంలో మాట్లాడారు.

మల్లన్న సాగర్, కొండపోచమ్మ బాధితులకు పాత ఇండ్లకు రూ.694 కోట్లు, ఇంటి యజమానికి ఉపాధి కింద రూ.7లక్షల 50 వేలు ఇచ్చాం. అన్ని వసతులతో కూడిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇచ్చాం. పెళ్లికాని పిల్లలకు 250 గజాల ఖాళీ స్థలం ఇచ్చాం. డబుల్ బెడ్రూమ్ ఇండ్లు గజ్వేల్ పట్టణ నడిబొడ్డున ఇచ్చాం. మూసీ ఇండ్లు కూల్చి, కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇచ్చారని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. నాడు కేసీఆర్ ఎలాగైతే భూ నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కట్టి ఇచ్చారో అలాగే సీఎం రేవంత్ రెడ్డి కూడా కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మూసీ బాధితులకు గచ్చిబౌలిలో 50 గజాల స్థలంలో ఇల్లు కట్టి ఇవ్వాలన్నారు. 675 ఎకరాలలో దేశలోనే నెంబర్ వన్ ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మించి ఇచ్చామని గుర్తు చేశారు. పేదల కోసం కేసీఆర్ డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కట్టి ఇస్తే మూసీ బాధితులకు ఇచ్చి రేవంత్ సొంత డబ్బా కొట్టు కుంటున్నాడని విమర్శించారు. మల్లన్న సాగర్ భూ నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తుండు. గజ్వేల్‌లో 3,414 డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కట్టించామన్నారు. ముంపు గ్రామాల బాధితులకు రూ.2 వేల కోట్లు కేసీఆర్ ఖర్చు పెట్టారు.

మీ ప్రభుత్వం వచ్చి ఏడాది అయినా మల్లన్న సాగర్ నిర్వాసితులకు రూపాయి అయిన ఇచ్చారా? అని ప్రశ్నించారు. తునికి బొల్లారంలో నాడు కేసీఆర్ 400 ఎకరాల్లో భూ నిర్వాసితుల కోసం ఇండస్ట్రియల్ పార్క్ కట్టిండు. వర్గల్ మండలంలో పరిశ్రమలు రాకుండా కాంగ్రెస్ వాళ్ళు అడ్డు పడుతున్నా రని విమర్శించారు. ఆ రోజు కోర్టుల్లో కేసులు వేసి ప్రాజెక్టులను అడ్డుకొని ఈ రోజు రూపాయి ఇవ్వకుండా గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ మిగిలిన నిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.


## గాజాపై మరోసారి ఇజ్రాయెల్ దాడి

- 33 మంది మృతి

**బలగం టీవి, హైదరాబాద్**



పాలస్తీనాలోని గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా మరోసారి గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడికి పాల్పడింది. ఈ దాడిలో 33 మంది పాలస్తీనియన్‌లు దుర్మరణం పాలయ్యారు. మరో 80 మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో 21 మంది మహిళలే ఉన్నారు. పరిస్థితిని బట్టి చూస్తే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నార్త్ గాజాలోని జబాలియా శరణార్థి శిబిరంపై ఈ దాడి జరిగిందని గాజాలోని అధికారులు వెల్లడించారు. కాగా తాజా దాడిలో మరణించిన 33 మందితో కలిపి ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు మొత్తం 42,500 మందికిపైగా పాలస్తీనియన్‌లు ప్రాణాలు కోల్పోయారు. మరో లక్ష మందికిపైగా గాయపడ్డారు. గాజాలోని హమాస్ మిలిటెంట్‌లే లక్ష్యంగా గత కొన్ని నెలల నుంచి ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది.



## జీవో 29ని ఉపసంహరించుకోవాలి

**బలగం టీవి, హైదరాబాద్**

గ్రూప్-1 అభ్యర్థుల ఆవేదనను అర్థం చేసుకుని పంథాలు, పట్టింపులకు పోకుండా జీవో 29ని ఉపసంహరించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి బండి సంజయ్ సూచించారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్‌కు నేడు లేఖ రాశారు. రేపు పరీక్షలని తెలిసినా విద్యార్థులు ఆందోళన కొనసాగిస్తున్నారంటూ పేర్కొన్న ఆయన్ నిరుద్యోగులంతా మీ కుటుంబ సభ్యులుగా భావించి వారి ఆవేదనను అర్థం చేసుకోవాలన్నారు. గ్రూప్-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలన్నారు. జీవో 29 కారణంగా గ్రూప్-1 పరీక్షల్లో 5,003 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు అనర్హులయ్యారన్నారు. 63 పోస్టులకు గుండుగుత్తగా 1:50 చొప్పున అభ్యర్థులను ప్రకటించడం అన్యాయమన్నారు.

ఈ మొత్తం పోస్టుల్లో 354 రిజర్వ్ పోస్టులని.. 29 జీవోతో ఓపెన్ కేటగిరిలో అర్హత సాధించిన రిజర్వ్ అభ్యర్థులను సైతం రిజర్వ్ కేటగిరీలో చేర్చడం అన్యాయమన్నారు. ఈ జీవోతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యర్థులు 1:50 చొప్పున అర్హత సాధిస్తే.. ఓసీ వర్గాలు 1:65 శాతం మేరకు అర్హత సాధించారన్నారు. జీవో నెంబర్ 29 రాజ్యాంగ స్ఫూర్తికి రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు వ్యతిరేకమన్నారు. గ్రూప్-1 అభ్యర్థులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారని.. గ్రూప్-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమని వాపోతున్నారన్నారు.

## త్వరలో

# హైదరాబాద్-యాదాద్రి ఎంఎంటీఎస్ పనులు



**బలగం టీవి, హైదరాబాద్**

అంతర్జాతీయ స్థాయిలో రూపుదిద్దుకుంటున్న చర్లపల్లి టర్మినల్ నెల రోజుల్లో ప్రారంభిస్తామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రూ.430 కోట్లతో కొనసాగుతున్న చర్లపల్లి టెర్మినల్ నిర్మాణ పనులను కిషన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.చర్లపల్లి నంచి హైదరాబాద్ నగరంలోకి రోడ్ కనెక్టివిటీ పెంచాల్సిన అవసరం ఉందన్న కిషన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ పనులను 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఆధునిక సౌకర్యాలతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు అంకితం చేస్తారని కేంద్రమంత్రి తెలిపారు. అమృత్ పథకంలో భాగంగా స్థానికంగా ఉన్న అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రూ.430 కోట్లతో చర్లపల్లి, రూ.715 కోట్లతో సికింద్రాబాద్, రూ.429 కోట్లతో నాంపల్లి రైల్వేస్టేషన్‌లలో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రూ.521 కోట్లతో కాజీపేటలో రైల్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించినట్లు తెలిపారు. దానికి సంబంధించిన నిర్మాణ పనులు త్వరలో చేపడతామన్నారు.



# రెండు టెస్టులకు భారత జట్టు ప్రకటన

**బలగం టీవి, హైదరాబాద్**

న్యూజిలాండ్‌తో మిగిలిన రెండు టెస్టుల కోసం బీసీసీఐ ఆదివారం 16 మందితో కూడిన భారత జట్టును ప్రకటించింది. ఈ జట్టులో స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు బీసీసీఐ అవకాశం కలిపించి అందరిని ఆశ్చర్యపరిచింది. అయితే తొలి టెస్టులో భారత స్టార్ స్పిన్ ఆలరెండు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 5 పరుగులే చేశాడు. ఈ నేపథ్యంలో వాషింగ్టన్‌ను పిలిపించడంతో రెండో టెస్టులో జడేజా స్థానంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా, ప్రస్తుతం జరుగుతున్న రంజీ ట్రోఫీ 2024-25 సీజన్‌లో సుందర్ అద్భుతంగా రాణిస్తున్నాడు. తమిళనాడుకు ప్రాతినిథ్యం వహిస్తున్న వాషింగ్టన్ ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో 152 పరుగులతో ఆకట్టుకున్నాడు. దీంతో అతడికి బీసీసీఐ నేరుగా కివీస్‌తో మిగిలిన టెస్టులకు ఎంపిక చేసింది.

**కివీస్‌తో చివరి రెండు టెస్టులకు భారత జట్టు:**

రోహిత్ శర్మ (కెప్టెన్), బుమ్రా, యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురేల్ (వికెట్ కీపర్), అశ్విన్, జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, సిరాజ్, ఆకాశ్ దీప్, వాషింగ్టన్ సుందర్.

# జగిత్యాల జిల్లాలో అన్నను నరికి చంపిన తమ్ముడు

**బలగం టీవి, హైదరాబాద్**

జగిత్యాల జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఆస్తి కోసం సొంత అన్ననే తమ్ముడు దారుణంగా హతమార్చాడు. ఈ విషాదకర సంఘటన మల్లాపూర్ మండలం ఒబులాపూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పల్లెపు సాయిలు, పల్లెపు చందు ఇద్దరు అన్న దమ్ములు. కాగా, ఆస్తి విషయంలో ఇద్దరు సోదరుల మధ్య కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు.మరోసారి ఆస్తి విషయంలో గొడవ తలెత్తడంతో కోపోద్రిక్తుడైన చందు గ్రామ శివారులో సాయిలును తల్వార్‌తో నరికి చంపాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా

**బలగం టీవి, హైదరాబాద్**

మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 20న జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో బిజెపి తన అభ్యర్థుల తొలి జాబితా నేటి మధ్యాహ్నం విడుదల చేసింది. ఈ జాబితాలో 99 మంది పేర్లు ఉన్నాయి.మహారాష్ట్రలో మొత్తం 288 సీట్లు ఉన్నాయి. అందులో బిజెపి తరఫున దాదాపు 160 మంది పోటీ చేయబోతున్నారు. మిగతా సీట్లను శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సిపికి వదిలేశారు. బిజెపి నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులలో ప్రముఖులు%ొ% మాజీ డిప్యూటీ సిఎం దేవేంద్ర ఫడ్నవీస్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ కూతురు శ్రీజయ చవాన్, బిజెపి చీఫ్ చంద్రశేఖర్ బవాంకులే, సహాయ మంత్రి సుధీర్ ముంగంటివార్, కేంద్ర మంత్రి రావుసాహెబ్ దాన్వే కుమారుడు సంతోశ్, సిట్టింగ్ ఎంఎల్ఏ మిహీర్ కొటెచ తదితరులు పోటీ చేస్తున్నారు.




## చికెన్ బిర్యానీలో కప్ప..

### గచ్చిబౌలిలోని ప్రభుత్వ ట్రిపుల్‌ఐటీ కాలేజీలో ఘటన

**బలగం టీవి, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ప్రభుత్వ ట్రిపుల్‌ఐటీ విద్యాసంస్థ మెస్‌లో విద్యార్థులు తినే చికెన్ బిర్యానీలో కప్ప దర్శనమిచ్చింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐఐటీలోని విద్యార్థులు ఈ నెల 16వ తేదీన కాలేజీలోని మెస్‌లో భోజనం చేస్తున్న సమయంలో బిర్యానీలో కప్ప కనిపించింది. దాంతో విద్యార్థులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వెంటనే ఈ విషయాన్ని కాలేజీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో విద్యార్థులు ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ప్రతిష్టాత్మక ఐఐటీలో విద్యార్థులకు ఇలా కల్తీ ఆహారం అందించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.



## హర్యానా గవర్నర్ దత్తాత్రేయ కాన్వాయ్‌కి ప్రమాదం

**బలగం టీవి, హైదరాబాద్**

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కాన్వాయ్ కి రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుండి ఢిల్లీ వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు దత్తాత్రేయ కాన్వాయి తో బయలు దేరారు. అయితే కాన్వాయి కి ఒక వ్యక్తి అడ్డు రావడంతో ముందు కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వస్తున్న మూడు వాహనాలు ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి . ఈ ప్రమాదం లో దత్తాత్రేయ ఎటువంటి గాయాలు కాకుండా సురక్షితం గా బయట పడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు



## అనుమతులు ఉన్న నిర్మాణాలను కూల్చివేయం

**బలగం టీవి, హైదరాబాద్**

గ్రేటర్ పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలతో సంచలనం సృష్టించిన 'హైడ్రా' తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. కూల్చివేతలకు సంబంధించి రియల్ ఎస్టేట్ వర్గాల్లో నెలకొన్న భయాందోళనలపై స్పష్టతనిచ్చింది. అనుమతులు ఉన్న నిర్మాణాలను కూల్చివేయబోమని, చట్టబద్ధంగా చేపట్టిన వెంచర్ల విషయంలో ఆందోళన అక్కర్లేదని భరోసా కల్పించింది. రియల్ ఎస్టేట్‌కు భరోసా కల్పించేలా సిఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఇచ్చిన ఆదేశాలకు కట్టుబడి ఉంటామని ప్రకటనలో పేర్కొంది. ' చెరువుల వద్ద అనుమతులున్న నిర్మాణాలను కూడా హైడ్రా కూల్చివేస్తుందంటూ ప్రచారం జరుగుతోంది. అయితే, చెల్లుబాటయ్యే అనుమతులున్న నిర్మాణాలను కూల్చివేయడం జరగదని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. సిఎం ఆదేశాలకు హైడ్రా కట్టుబడి ఉంది" అని హైడ్రా స్పష్టం చేసింది.

# తొలి టెస్టు కివీస్‌దే..

## 36 ఏళ్ల తర్వాత భారత్‌లో న్యూజిలాండ్ గెలుపు




**బలగం టీవి, బెంగళూరు**

న్యూజిలాండ్ జట్టు చరిత్ర సృష్టించింది. దాదాపు 36 ఏళ్ల తర్వాత భారత గడ్డపై న్యూజిలాండ్ టెస్ట్ మ్యాచ్ గెలిచింది. భారత్‌తో బెంగళూరులో జరిగిన మొదటి టెస్టు మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. బౌలర్ల అద్భుత ప్రదర్శనతో భారత్‌ను 462 పరుగులకు కట్టడి చేసిన కివీస్.. 107 పరుగుల లక్ష్యాన్ని తేలికగా ఛేదించింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్లు డెవాన్ కాన్వే(17), టామ్ లాథమ్(0)లు ఓపెనర్లు విఫలమైనా యువకెరటాలు విల్ యంగ్(48 నాటౌట్), రచిన్ రవీంద్ర(39 నాటౌట్)లు ఏకాగ్రతగా ఆడారు. అజేయంగా నిలిచి జట్టును గెలిపించారు. దాంతో, 1988 తర్వాత భారత్‌లో మొదటి గెలుపుతో న్యూజిలాండ్ రికార్డు నెలకొల్పింది. భారీ విజయంతో కివీస్ మూడు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

వర్షం కారణంగా మ్యాచ్ కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో అంతకుముందు మ్యాచ్‌లో నాలుగు బంతులు వేసిన బుమ్రా, ఆ ఓవర్‌ను పూర్తి చేసేందుకు వచ్చాడు. అయితే బుమ్రా వేసిన రెండో బంతికే కెప్టెన్ టామ్ లేథమ్‌ను ఎల్బీగా పెవిలియన్‌కు చేర్చాడు. అయితే తొలి వికెట్ పడ్డాక విల్ యంగ్‌తో కలిసి డేవన్ కాన్వే ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. కానీ, బుమ్రా మాత్రం తన బౌలింగ్‌తో కాన్వేను ఎల్బీ చేశాడు. బుమ్రా కట్టుదిట్టంగా బంతులేసినప్పటికీ, సిరాజ్ మాత్రం వికెట్ తీయలేకపోయాడు. స్పిన్నర్లకూ పెద్దగా సహకారం కూడా లభించలేదు. రచిన్, విల్ యంగ్ దూకుడుగా ఆడి జట్టును ముందుకు నడిపించారు.




## టైటాన్స్‌కు షాక్..

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో తెలుగు టైటాన్స్‌కు రెండో మ్యాచ్‌లో షాక్ తగిలింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 29-44 తేడాతో తమిళ్ తలైవాస్ చేతిలో ఓటమిపాలైంది. టైటాన్స్ కెప్టెన్ పవన్ సెహ్రావత్(10) వరుసగా రెండో సారి సూపర్-10 సాధించినా జట్టును గెలిపించలేక పోయాడు. పవన్‌కు తోడు విజయ్ మాలిక్(9) పోరాటం టైటాన్స్‌కు కలిసి రాలేదు. నరేందర్ ఖండోలా, సచిన్ సూపర్-10 ప్రదర్శనలతో తమిళ్ తలైవాస్ భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది.

## ఎమర్జింగ్ ఆసియాకప్‌లో భారత్ శుభారంభం




**బలగం టీవి, హైదరాబాద్**

ఏసీసీ ఎమర్జింగ్ ఆసియాకప్ టీ20 టోర్నీలో భారత్-ఏ శుభారంభం చేసింది. దాయాదీ పాకిస్థాన్-ఏతో శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్-ఏ 7 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్-ఏ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 183 పరుగులు చేసింది. కెప్టెన్ తిలక్ వర్మ(35 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సలతో 44), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(19 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సలతో 36), అభిషేక్ శర్మ(22 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సలతో 35) రాణించారు. పాకిస్థాన్ -ఏ బౌలర్లలో మహమ్మద్ ఇమ్రాన్, జమాన్ ఖాన్, అరఫత్ మిన్‌హాస్, కాసిమ్ అక్రమ్ తలో వికెట్ తీయగా.. సుఫియన్ ముఖీమ్ రెండు వికెట్లు పడగొట్టాడు.

అనంతరం లక్ష్యచేధనకు దిగిన పాకిస్థాన్-ఏ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 176 పరుగులు చేసి ఓటమిపాలైంది. అరఫత్ మిన్‌హాస్(29 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 41), యాసిర్ ఖాన్(22 బంతుల్లో ఫోర్, 3 సిక్సలతో 33) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో అన్షుల్ కంబోజ్(3/33) మూడు వికెట్లు తీయగా.. రసిక్ సలామ్(2/30),



నిషాంత్ సింధు(2/15) రెండేసి వికెట్లు తీసారు.

## 'మెకానిక్ రాకీ' ట్రైలర్ విడుదల




**బలగం టీవి, హైదరాబాద్**

విశ్వక్ సేన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కామెడీ, లవ్, యాక్షన్ జానర్‌లో ఈ సినిమా తెరకెక్కించారు. నవంబరు 22న సినిమా వరల్డ్‌వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఆదివారం ట్రైలర్ రిలీజ్ చేశారు. మేకర్స్ ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో విశ్వక్ సేన్, హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్‌తోపాటు డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

'కంప్యూటర్ సైన్స్ చదివి, సివిల్ ఇంజినీర్ అయిపోతా' అని హీరో తన తండ్రికి చెప్పే డైలాగ్?తో ట్రైలర్ ప్రారంభమైంది. హీరో తన తండ్రి మెకానిక్ గ్యారేజ్‌లోనే ఉంటూ డ్రైవింగ్ నేర్పిస్తుంటాడు. ఈ క్రమంలోనే అతడికి హీరోయిన్లు శ్రద్ధా, మీనాక్షీ పరిచయం అవుతారు. ఈ లవ్ ట్రాక్‌ను రొమాంటిక్, ఫన్నీగా తీర్చిదిద్దినట్లున్నారు. డు మా అబ్బాయి దేనికి పనికి రాడు.. అంటూ ట్రైలర్‌లో నరేశ్ తన కొడుకు మెకానిక్ రాకీ గురించి చెబుతున్న సంభాషణలు ఫన్నీగా సాగుతున్నాయి. ఓ వైపు మెకానిక్ రాకీగా.. మరోవైపు లవర్ బాయ్ విశ్వక్ సేన్ ఫన్, లవ్, సీరియస్ ట్రాక్‌తో మాస్ కా దాస్ మార్క్ ఎలిమెంట్స్‌తో సాగుతున్న ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది.

